క్లుప్తంగా

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని రాష్ట్ర కన్వీనర్ మహేందర్ కోరారు. శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. నాయకులు సంజీవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లు అందజేత

జ్యోతినగర్: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలికలకు శనివారం సైకిళ్లు అందజేశారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 25 మంది బాలికలకు రామగుండం ప్రాజెక్టు సీఎస్సార్ ఆధ్వర్యంలో సైకిళ్లను అందించారు. బాలికా సాధికారతకు ఎన్టీపీసీ సహకారం ఉంటుందని రెసిడెంట్ మేనేజర్ దీపక్ సహాయ్ పేర్కొన్నారు. కైలాస్ ప్రసాద్, ఆశిష్‌శర్మ, రవీందర్, పవన్, హెచ్‌ఎం బేబి రాణి, ఆకుల రాజన్న, రాములు, లక్ష్మణ్, దేవిక, రంజిత, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



ప్రశంసాపత్రం అందుకుంటున్న భాస్కర్

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట విద్యుత్ లైన్‌మెన్ భాస్కర్ సేవలకు గుర్తింపు దక్కింది. శుక్రవారం విద్యుత్ డివిజన్ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఎస్ఈ బొంకూరి సుదర్శన్ చేతలమీదుగా భాస్కర్ ప్రశంసాపత్రం స్వీకరించారు. ప్రశంసాపత్రం అందుకోవడంపై ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాధవి తదితరులు

గోదావరిఖనిటౌన్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా క్యాలెండర్‌ను కళాశాల ప్రిన్సిపాల్, అసోసియేషన్ అధ్యక్షురాలు గార మాధవి శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గొరిశెట్టి శ్రీధర్, కలబోయిన శంకరయ్య, మంథెన శ్రీనివాస్, కె.శ్రీనివాస్. జీడి కనుకయ్య, రేణికుంట్ల శ్రీనివాస్, హస్మాత్ అలీ, కోరె శ్రీనివాస్, రామ్మూర్తి తదితరుల పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ కుమార్

మంథని: ఆరోగ్యం పట్ల విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ కుమార్ సూచించారు. శనివారం మంథని మండలం ఆరెంద జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులు మంచి ఆహారం తీసుకోవాలన్నారు. మంచి ఆహారం తీసుకుంటే శరీరంలో రక్త హీనత రాదన్నారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఫార్మసిస్ట్ రఘునాయక్, ఏఎన్‌ఎం సరోజన తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

మంథని: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి కూచిరాజ్‌పల్లి వద్ద శనివారం రాత్రి ఇసుక లారీలను అధికారులు తనిఖీ చేశారు. మంథని, ముత్తారం మండలాల్లోని క్వారీల నుంచి తరలిస్తున్న ఇసుక వాహనాల వే బిల్లులు, ఇతర ధ్రువపత్రాలను టీఎస్‌ఎండీ ఎస్‌ఆర్‌వోలు రాజ్‌కుమార్, అరవింద్ పరిశీలించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో రూ.7లక్షల 45 వేల వ్యయంతో చేపట్టే సీసీరోడ్డు పనులను శనివారం సర్పంచ్ లావణ్య ప్రారంభించారు. మంథని మెయిన్ రోడ్డు కమాన్ నుంచి గ్రామంలోకి వెళ్లడానికి రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌ను వివరించగా, రెమిడేషన్ ప్లాన్ ఫండ్ నుంచి రూ.7లక్షల 45 వేలు మంజూరు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. జీఎంకు సర్పంచ్, గ్రా మస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

మాటలు చెప్పడం కాదు.. బాధ్యతగా పనిచేయాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- మండల సమావేశంలో మిషన్ భగీరథ అధికారుల తీరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: 'రానున్నది వేసవికాలం.. మండల సర్వసభ్య సమావేశంలో మాటలు చెప్పి దులుపుకోవడం సరికాదు.. ప్రజలకు మంచినీరందించకపోతే ప్రజల నుంచి వ్యతిరేకత, ఒత్తిడి పెరుగుతుంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనుల కోసం ఓ అండ్‌ఎం పాలసీ అమలుకు గత ప్రభుత్వంలో ఉన్నతాధికారులకు పంపించిన లేఖ ఎక్కడా' అని మిషన్ భగీరథ డీఈఈ రాజ్‌కుమార్‌పై ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వ విప్, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ విప్ సమావేశం హాల్‌లోకి వచ్చిన సమయంలోనే భగీరథ నీటి సరఫరాపై చర్చ జరుగుతుంది. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ, తమ చేతుల్లో ఏం లేదని, గత ప్రభుత్వం మరమ్మత్తు కోసం నిధులు కేటాయించలేదని చెప్పుకొచ్చారు. దీంతో ప్రభుత్వ విప్ స్పందిస్తూ.. ప్రభుత్వానికి నివేదించిన, ఈఎన్‌సీకి పంపించిన లేఖలు చూపించాలని ప్రశ్నించగా, తాము లిఖితపూర్వకంగా ఇవ్వలేదని మౌలికంగా చెప్పామని డీఈఈ పేర్కొన్నారు. దీంతో డీఈఈపై ప్రభుత్వ విప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కార మార్గం చూపించాలని సూచించారు. భగీరథ పైప్‌లైన్‌లలో సమస్యలు ఉత్పన్నమైతే ప్రత్యామ్నాయంగా గతంలో ఉన్న మంచినీటి బావుల ద్వారా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు సాగు చేసిన వరి పంటలో మొగిపురుగు సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు ఆరోపించారు. కోతులు కుక్కలతో ఇబ్బందులు కల్గుతున్నాయని, వాటి నియంత్రణకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ తుమ్మల రాంబాబు కోరారు. మేడారం ప్రభుత్వ ఆసుపత్రి ఏరియాలో ఇళ్లపై నుంచి 11కేవీ విద్యుత్తు వైర్ వెళ్లడంతో ఇబ్బందిగా మారిందని ఎంపీటీసీ మిట్ట తిరుపతి అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. కటికెనపల్లి గ్రామ శివారులోని ఇప్పలకుంట ఆక్రమణకు గురైందని, వెంటనే సర్వే చేసి కుంట భూమిని కాపాడాలని ఎంపీటీసీ శ్రీనివాస్ కోరారు. సమావేశంలో సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, పత్తిపాక పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించాలి

- పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- సర్వసభ్య సమావేశంలో సర్పంచుల డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీపీ రేణుకాదేవి

ఓదెల: చివరి ఆయకట్టుకు సాగునీటిని అందించాలని ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సర్పంచులు డిమాండ్ చేశారు. శనివారం ఎంపీపీ కునారపు రేణుకాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ మాట్లాడుతూ, యాసంగి పంటలకు గుంపుల, గూడెం చివరి భూమలకు ఎస్సారెస్పీ నీటిని అందించాలన్నారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరి చేయాలని సర్పంచులు సభ దృష్టికి తీసుకెళ్లారు. గోపరపల్లె సర్పంచ్ కర్క మల్లారెడ్డి, కొలనూర్ ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామాల్లో మిషన్‌భగీరథ నీరు రావడం లేదని, కొత్త కనెక్షన్లతో పాటు మరమ్మతులు చేపట్టాలని కోరారు. జమ్మికుంట నుంచి సుల్తానాబాద్ మధ్య నడిచే ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కనగర్తి సర్పంచ్ కోట దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సును నడిపించాలని సంబంధిత అధికారులను పిట్టల ఎల్లయ్యపల్లె సర్పంచ్ పిట్టల సరిత కోరారు. సమావేశంలో ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ యాకన్న, సర్పంచులు, ఎంపీటీసీలు, ఏఈఈలు సమ్మిరెడ్డి, స్రవంతి, మోహన్, రాజమల్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం

గోదావరిఖని: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పంక్షన్‌హాల్‌లో పాలకుర్తి, అంతర్గాం మండలాల సర్పంచ్‌లను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రగతి కార్యక్రమంలో వైకుంఠధామాలు, డంప్‌యార్డులు, ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారన్నారు. పల్లెలను అందంగా తీర్చిదిద్దేలా కృషి చేశారని వివరించారు. చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక పోవడం వల్లే గత ఎన్నికల్లో పార్టీకి నష్టం జరిగిందన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఆముల నారాయణ, నాయకులు కౌశికహరి, మట్ట లక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. 7వ డివిజన్ గంగానగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కల్వర్టుల పనులను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పాలకుల నిర్లక్ష్యంతో కార్పొరేషన్ పరిధిలో చాలా డివిజన్‌లు అభివృద్ధిలో వెనకబడి ఉన్నాయన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకరావాలని కోరారు. మేయర్ బంగి అనిల్ కుమార్, నాయకులు మహంకాళి స్వామి తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక పూజలు

గోదావరిఖనిటౌన్: తాజొద్దీన్‌బాబా జన్మదినం సందర్భంగా సప్తగిరికాలనీలోని దర్గాలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి బాబా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భావితరాలకు ఆదర్శంగా ఉండాలి

విద్యార్థులు భావి తరాలకు ఆదర్శంగా ఉండి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అన్నారు. సప్తగిరి కాలనీలోని మహాత్మా జ్యోతీబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామగుండం మండలంలో విలీనం చేయాలి

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలంలోని లక్ష్మీపురం, ఎల్కలపల్లిగేట్ గ్రామాలను రామగుండం మండలంలో విలీనం చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్ వినతి పత్రం అందించారు. కన్నూరి శంకర్, మోహిద్, బాలకృష్ణ, వేముల చందు, గర్రెపల్లి శంకర్, ఒడ్నాల రాజేశం, రవి, తాజ్, కలీం, లింగయ్య పాల్గొన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఓదెల: ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, నాయకులు మహేశ్, వెంకటస్వామి, సురేశ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్న మాదిరిగా వేతనాన్ని రూ.24వేలకు పెంచాలని కోరారు.

అందుబాటులో ఉండి సేవ చేస్తా

ఓదెల: సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో పెద్దపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో సీడీపీ నిధులు రూ.5లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సహకారంతో అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. మొదటిసారి ఉప్పరపల్లెకు విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు సన్మానం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సర్పంచ్ పల్లె ఓదెలు, ఎంపీటీసీ గోపు లావణ్య, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

ఓదెల మండలం కొలనూర్, హరిపురం, గుండ్లపల్లె, కేశవపూర్ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పుచ్చకాయల లక్ష్మి, బావు ఎల్లయ్య, కొండపల్కల రాములు కుటుంబాలను ఎమ్మెల్యే విజయ రమణారావు పరామర్శించారు. మాజీ సర్పంచ్ పుప్పాల శంకర్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోదావరిఖనిటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పెద్దపల్లి కిషన్ తెలిపారు. రమేశ్‌నగర్, ఎల్‌బీనగర్, అడ్డగుంటపల్లి ఏరియాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎలిగేడుకు మంత్రి రాక

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పలు అభివృద్ధి పనులు, కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరుకానున్నారని ఎంపీడీవో శ్రీనివాస మూర్తి తెలిపారు. ప్రజా పతినిధులు, అధికారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం

పెద్దపల్లిరూరల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చంద్రుపట్ల సునీల్‌రెడ్డికి ఆదివారం పెద్దపల్లిలో సన్మాన సభ నిర్వహించనున్నట్లు నాయకులు పర్స సమ్మయ్య, వెల్లంపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

లే అవుట్ లేని వెంచర్ల హద్దురాళ్లు తొలగింపు



హద్దురాళ్లు తొలగించి రోడ్లను చదును చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 1,116లో నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా మార్చిన వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సిబ్బంది శనివారం తొలగించారు. వ్యవసాయ భూమిలో లేఅవుట్ అనుమతులు పొందకుండానే ప్లాట్లుగా మార్చి అమ్ముతూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారంటూ గ్రామానికి చెందిన తాడిచెట్టి శ్రీకాంత్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో పంచాయతీ సిబ్బంది హద్దురాళ్లను తొలగించి, రోడ్లను చదును చేశారు. నిబంధనలు పాటించకుండా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మడం చట్ట విరుద్ధమని ఎంపీవో సుదర్శన్ పేర్కొన్నారు. గతంలోనూ పలుమార్లు రియల్టర్లకు నోటీసులు అందించామని వివరించారు. లే అవుట్ లేని ప్లాట్లలో ఇంటి నిర్మాణాలకు పంచాయతీ అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. కొనుగోలుదారులు లే అవుట్ ఉందా..లేదా అని నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

చెకుముకి సైన్స్ సంబరాలు



బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం జయరాజు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం మండల స్థాయి చెకుముకి ప్రతిభా పాటవ పోటీలను జన విజ్ఞాన వేదిక ఉమ్మడి రామగుండం కన్వీనర్ గద్దె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాల విభాగం నుంచి కేజీబీవీ రామగుండం విద్యార్థులు కె.కీర్తి, సుధా, కృష్ణవేణి, సాయిశ్వేత, ప్రైవేట్ స్కూల్ విభాగం నుంచి అంజికారాణా, యథార్థ్ నిగోత్, విష్ణు స్వరూప్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలను పాఠశాల హెచ్‌ఎం జయరాజ్, గద్దె శ్రీనివాస్ అందించారు. ఫిబ్రవరి 3న పెద్దపల్లిలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనాలని తెలియజేశారు. ఉపాధ్యాయులు స్వర్ణలత, అనురాధ, కల్పన, రాజేశ్వరి, శ్రీధర్, ప్రేమ్‌కుమార్, తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో శనివారం చెకుముకి విజేతలకు హెచ్‌ఎం పద్మావతి ప్రశంసాపత్రాలు అందజేశారు. మండలస్థాయిలో ప్రతిభచూపిన రక్షిత, ఇంద్రాణి, అశ్విత అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు మంథని విద్యార్థులు

మంథని: మంథని పరిధిలో చెకుముకి పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో బాలుర హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, బాలికల ఉన్నత పాఠశాల ద్వితీయ, మండలంలోని గుంజపడుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. తెలుగు మీడియంలో ఆరెంద జెడ్పీహెచ్‌ఎస్ ప్రథమ, పలు ప్రైవేటు పాఠశాలల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఎంఈవో దాసరి లక్ష్మి, మండల నోడల్ అధికారి హరిప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

సుల్తానాబాద్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ కోరారు. శనివారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయ రమణారావును సన్మానించిన అనంతరం మాట్లాడారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యంకల్పించాలన్నారు. సమావేశంలో కడారి తిరుపతి, సదయ్య, పోచమల్లు, నరేశ్, లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుబాయ్‌లో మహాసంకల్ప పరిపూర్ణ యజ్ఞం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



దాండియా ఆడుతున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్: ఇటీవల అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట అనంతరం దుబాయ్‌లోని తెలుగువారు మహాసంకల్ప పరిపూర్ణ యజ్ఞం నిర్వహించారు. బీజేపీ ఎన్‌ఆర్‌ఐ సెల్ విదేశీ విభాగ్ జాయింట్ కన్వీనర్ మహబూబ్‌నగర్‌కు చెందిన ఎస్.దేవేందర్‌రెడ్డి తెలుగు ఆధ్యాత్మిక సమితి నేతృత్వంలో హోమ క్రతువు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు రామనామ కీర్తనలతో దాండియా ఆడారు. చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి.

పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దు

గోదావరిఖని: పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు హెచ్చరించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ టి.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు ఉదయ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా వాహనాలు నడపాలి

రామగిరి: డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ వాహనాలు నడపాలని ఎస్సై రవిప్రసాద్ అన్నారు. శనివారం రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు.

ధర్మారంలో..

ధర్మారం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ధర్మారం రెండవ ఎస్సై అశ్విని కోరారు. మండలంలోని పత్తిపాక క్రాస్‌రోడ్డు వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

సదాశయ సేవలను విస్తృతపర్చాలి



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

కమాన్‌పూర్: సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను జాతీయస్థాయిలో విస్తృతపర్చాలని ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని జూలపల్లిలో జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సేవలను అందించడం జరుగుతుందన్నారు. ప్రజల్లో నేత్ర, అవయవ, శరీరదానంపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సానా రామకృష్ణారెడ్డి, నూక రమేశ్, మారెల్లి రాజిరెడ్డి, లింగమూర్తి, భీష్మాచారి, కవిత, చంద్రమౌళి, అనంత రాములు, కేఎస్ వాసు, శంకర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

రామగుండం: కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధి అబాది రామగుండం ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని శనివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ఈదునూరి హరిప్రసాద్, అప్పాసి శ్రీనివాస్, సాదు రమేశ్, బొద్దుల శంకర్, నామాల కుమార్ తదితరులున్నారు.

'ఎన్టీపీసీ ఉద్యోగాల పేరుతో కుంభకోణం'

గోదావరిఖని: ఆర్‌ఎఫ్‌సీఎల్ లాంటి ఉద్యోగాల దందా ఎన్టీపీసీలో జరుగుతోందని బీజేపీ నేత కందుల సంధ్యారాణి విమర్శించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల జీవితాలను ఆగం చేస్తున్నారని, స్థానికేతరులకు ఉద్యోగాలిస్తు స్థానికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. దీనిపై లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ గుమాస్తాల కార్యవర్గం



మాతంగి రాయమల్లు



బాలకృష్ణ

సుల్తానాబాద్: మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన మాతంగి రాయమల్లును రైస్‌మిల్ గుమాస్తాల సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు ప్రకటించారు. శనివారం మండల కేంద్రంలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా కొల్లూరు కొమురయ్య, వేగోళం అనిల్, కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి కందునూరి భగవాన్, కార్యదర్శులు కుందేళ్ల రవి, ప్రశాంత్, ప్రచారకార్యదర్శి కోడూరి మహేశ్, సలహాదారులు జాకీర్, వేగోళం శంకర్‌గౌడ్, గౌరవ అధ్యక్షులు ఎర్రవెల్లి ముత్యంరావు, హరికిషన్, కార్యవర్గసభ్యులు మాతంగి రాజేశ్, కురుమ శ్రీనివాస్, కొమురవెల్లి శ్రీశైలం, ప్రశాంత్‌రావు, చొప్పరి అనిల్, మాటేటి శంకర్, బండ సదయ్య, కంకణాల రాజ్‌కుమార్, కాల్వ సంతోష్, కుడుదుల గౌతం, కోట రాజ్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు.

పెద్దపల్లి మండల మీ సేవ అధ్యక్షుడిగా శ్రీనివాస్



మిట్టపల్లి శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల మీ సేవ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెప్పాల మహేందర్, సహాయ కార్యదర్శి బంక భూమేశ్, ఉపాధ్యక్షుడు కుంకుమల్ల సత్యనారాయణ, కోశాధికారి కనపర్తి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నో బ్యాగ్ డే

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధి సెంటనరీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లె ప్రతిమ సమావేశం నిర్వహించి మౌలిక సదుపాయల గురించి తెలుసుకున్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో నాటిన మొక్కలను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

తాజొద్దీన్ బాబా జన్మదిన వేడుకలు



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని దర్గాలో శనివారం తాజొద్దీన్ బాబా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా న్యూమారేడుపాక, పోతనకాలనీ ఏరియాలో చాదర్ ర్యాలీ నిర్వహించారు. దర్గా నిర్వాహకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: తాజొద్దీన్ బాబా జన్మదినం సందర్భంగా శనివారం స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి తాజొద్దీన్ బాబా మందిరం వరకు ఊరేగింపు ఉత్సవాన్ని నిర్వాహకులు నారదాసు సతీశ్‌రావు ఘనంగా నిర్వహించారు.